జానిమాజ్‌లకు భలే గిరాకీ

నమాజ్‌లో నేలపై పరిచే పవిత్ర వస్త్రమే జానిమాజ్

- కొనసాగుతున్న అంతర్జాతీయ జానిమాజ్‌ల ఎగ్జిబిషన్
- మసీదులకు ఉచితంగా జానిమాజ్‌లు అందజేసే దాతలకు రాయితీ


ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన జానిమాజ్‌లు

చార్మినార్: రంజాన్ మాసంలో జానిమాజ్‌లకు ఎంతో ప్రాధాన్యముంది. ముస్లింలు దీనిని ఎంతో పవిత్ర వస్త్రంగా భావిస్తారు. ముస్లింలు నమాజ్ చేసే సమయంలో నేలపై పరిచే పవిత్ర వస్త్రమే జానిమాజ్. ముఖ్యంగా రంజాన్ మాసంలో జానిమాజ్‌లపై కూర్చుని ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. రంజాన్ మాసంలో నిర్వహించే రోజు వారి ప్రార్థనలకు జానిమాజ్‌లను వినియోగిస్తారు. గత కొన్నేళ్ల నుంచి నగరంలో జానిమాజ్‌లను కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఎంతో మంది తమ ఇండ్లలోకి, మసీదుల్లోకి జానిమాజ్‌లను కొనుగోలు చేయడాన్ని పుణ్య కార్యంగా భావిస్తున్నారు. కొంత మంది దాతలు తమ ఆత్మీయుల స్మృత్యర్థం జానిమాజ్‌లను మసీదులకు అందజేస్తున్నారు. సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా, మదీనాలలోని మసీదులలో ఉన్నటు వంటి జానిమాజ్‌లపై తమ నమాజ్‌ను పూర్తి చేయాలని ప్రతి ముస్లిం కోరుకుంటారు.


జానిమాజ్‌పై నమాజ్ చేస్తున్న మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారి తదితరులు

పాతబస్తీలో జానిమాజ్‌ల ప్రదర్శన..

ప్రపంచ వ్యాప్తంగా విశేష ప్రాచుర్యంలో ఉన్న జానిమాజ్‌లను మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ (ఎంసీఎం) ఒకే వేదికపైకి తీసుకువచ్చి నెల రోజుల పాటు కొనసాగే అంతర్జాతీయ జానిమాజ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారి ఆధ్వర్యంలో జానిమాజ్‌ల ప్రదర్శన కొనసాగుతోంది. ఇస్లాం సంస్కృతిని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా సౌదీ అరేబియా, టర్కీ, ఇరాన్, బెల్జియం, భారత్‌లలో లభ్యమయ్యే జానిమాజ్‌లను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసామని బుకారీ తెలిపారు. మసీదులకు ఉచితంగా అందజేయడానికి ముందుకొచ్చే దాతలకు పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తున్నామన్నారు. సాధారణ వినియోగదారులకు పది శాతం రాయితీతో జానిమాజ్‌లను అందజేస్తున్నామన్నారు.

రంజాన్‌లో చిరుధాన్యాలు వాడకం మేలు

గోల్కొండ: రంజాన్‌లో ఉపవాస దీక్షలు ఉండే వారు చిరుధాన్యాలతో చేసిన వంటకాలను వాడితే ఆరోగ్యంగా ఉండగలుగుతారని నానల్‌నగర్‌లోని ఆలివ్ హాస్పటల్స్ మెనేజింగ్ డైరెక్టర్ ఆగా ముజాహిద్ హుస్సేన్ అన్నారు. గ్రేస్ ఆఫ్ గుడ్‌నెస్ అనే పుస్తకాన్ని ఆసుపత్రిలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాల పట్ల ఇంకా చాలా మందికి సరైన అవగాహన లేదన్నారు. అందువల్లే తాము చిరుధాన్యలపై ప్రత్యేకంగా పుస్తకాన్ని ముద్రించామన్నారు. చిరుధాన్యాల వాడకం, వాటి రెసిపిని కూడా ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ పుస్తకాన్ని తాము ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పీడీఎఫ్ ఫార్మేట్‌లో సాఫ్ట్ కాపీని పొందడానికి 96666 95940లో తమ పేరు, వయస్సుతో రిక్వేస్ట్ పంపాలని ఆయన కోరారు.

నియామకం


జ్యోతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న దేవేందర్ ముదిరాజ్

సుల్తాన్‌బజార్: ముదిరాజ్ సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తామని శీలం జ్యోతి ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా గురువారం జరిగి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నగరానికి చెందిన జ్యోతి ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సంజీవన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్‌మోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ..పార్టీ అభివృద్ధి, ఐక్యత కోసం అందరిని కలుపుకొని పోరాడుతానన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లపై టోలిచౌకి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టోలిచౌకి చౌరస్తా, పాత ముంబాయి జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో పాదచారుల కోసం వేసిన ట్రాక్‌లో అక్రమంగా పార్కు చేసి ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకొని గోల్కొండలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్ జామ్ అవ్వడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌ల నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మక్కా యాత్ర ప్రతి ముస్లిం కల


మహ్మద్ గౌస్‌ను సన్మానిస్తున్న మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లడం, మక్కా మదీనా నగరాలను చూడడం ప్రతి ఒక్క ముస్లిం జీవిత కల అని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెంగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గోల్కొండ ఎండిలైన్స్‌కు చెందిన ఎంజేపీ డెయిరీ ప్రొడక్ట్స్ మెనేజింగ్ డైరెక్టర్ గౌస్‌భాయ్ ఉమ్రా యాత్రకు వెళ్తున్న సందర్భంగా గురువారం ఆయనను మహ్మద్ నజీబ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఉమ్రా యాత్రకు వెళ్లడం దేవుడు ఇచ్చిన వరం అన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండడం ఒక ఎత్తు అయితే తరావీ ప్రార్థనలు చేయడం మరో ఎత్తు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖాలేద్ అలీఖాన్, పర్వేజ్, మహ్మద్ నయీం, బాబు, వఖార్, ఎంజేపీ డెయిరీ ప్రొడక్ట్స్‌కు చెందిన ప్రతినిధులు ఉన్నారు.

అంతరిక్ష మోటార్స్ కొత్త టీవీఎస్ షోరూమ్ ప్రారంభం



సాక్షి,సిటీబ్యూరో: అంతరిక్ష మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్త టీవీఎస్ షోరూమ్‌ను టోలిచౌకి రాహుల్‌కాలనీలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ చైర్మన్ అరవింద్‌కుమార్ బల్గట్, ఎండీ అరిహంత్, సంస్థ ప్రతినిధులు కులదీప్ శర్మ, వికాస్ సైని, దర్శన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి



గౌలిపురా: ఛత్రినాక సెక్షన్ పరిధిలోని గౌలిపురా డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే సమయంలో చుట్టూ ఉన్న కంచెను కూల్చివేసి నూతనంగా ఏర్పాటు చేశారు. అనంతరం ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడను ఏర్పాటు చేయకుండా, మట్టికుప్పలను అలాగే రోడ్డుపై వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్ యాత్ర



సుల్తాన్‌బజార్: పాల్గున మేళా పురస్కరించుకొని బజరంగ్ సేనా ఆధ్వర్యంలో గురువారం కోఠి పుత్లిబౌలిలోని చౌరస్తా నుంచి కాచిగూడ శ్యామ్ బాబా ఆలయం వరకు శ్యాం బాబా పాల్గున మేళను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విషయాన్ని యాత్ర పేరిట పార్లు దండాలు పెడుతూ కాచిగూడ శ్యాం బాబా ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ. .ప్రతి యేటా శ్యాం బాబా భక్తులు నిషాన్ యాత్ర పేరిట ఎంతో భక్తిశ్రద్ధలతో ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఈ యాత్రలో పాల్గొనడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా

అబిడ్స్: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే అందరి ప్రాణాలు పదిలంగా ఉంటాయని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ గాండ్ల శంకర్‌రాజు పేర్కొన్నారు. పలువురు వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించకపోవడంతోనే ప్రతి యేటా వేలాది మంది తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిజాం కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి రోడ్డు భద్రత అవగాహనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ..మనిషి విలువ ఎంతో విలువైందన్నారు. ప్రాణం విలువ తెలుసుకుని ప్రతి వాహనదారుడు పోలీసులు నిబంధనలు నాటించాలని ఆయన సూచించారు. కొంత మంది నిబంధనలు పాటించకపోవడం ద్వారా ఇతరులకు కూడా పలు సందర్భాల్లో సమస్యల తలెత్తుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను నిర్వహించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయరావు, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ అధికారులు వెంకటేశ్వర్లు డాక్టర్ మంజుల, సుదర్శన్, అడ్వైజర్ మొహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మక్కా మసీదులో యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో రానున్న ఐదు శుక్రవారాల పాటు నిర్వహించనున్న యౌముల్ ఖురాన్ సభలో భాగంగా రెండో శుక్రవారం సందర్భంగా ఆలిండియా సున్నీ ఉలామా బోర్డు ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభ ఉంటుందని మసీదు నిర్వాహకులు తెలిపారు.

జియాగూడ అభివృద్ధికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న ఉస్మాన్ అలీ, వినోద్ చౌగ్లే

జియాగూడ: సుమారు రూ.3 కోట్లతో జియాగూడ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ అన్నారు. గురువారం జియాగూడలోని 2బీ హెచ్‌కే కాలనీ, ఇమాంపురా, డోర్‌బస్తీ తదితర ప్రాంతాల్లో జియాగూడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలను సందర్శించారు. జియాగూడ 2బి హెచ్‌కే కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను సందర్శిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డోర్‌సమాజ్ అధ్యక్షుడు దత్తు పోల్, కాంగ్రెస్ నాయకులు నవీన్, ఉమేష్ ఓట్కర్, మహేష్‌బాబు, ఆనంద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

అబిడ్స్: కురుమ కులస్తుల కోసం ప్రత్యేక కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి గురువారం ఆయన ముఖ్యమంత్రిని సన్మానించి కురుమ కులస్తుల సమస్యలతో కూడిన మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గొల్లకురుమ కార్పొరేషన్‌ను ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని అలా కాకుండా కురుమ కులస్తుల కోసమే కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే లక్షలాది కురుమలకు ప్రయోజనం ఉంటుందన్నారు. రాష్ట్రంలో యాదవ్‌లతో పోల్చుకుంటే కురుమలు లక్షలమంది అధికంగా ఉన్నారన్నారు. రాజకీయంగా, సామాజికంగా, వెనుకబడిన కురుమ కులస్తుల కోసం కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు యెగ్గె మల్లేశం తెలిపారు.


ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పాత్రికేయులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీని పాత్రికేయుల బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పుండరీ చారి, చంద్రంగౌడ్, సాగర్, దేవేందర్, వెంకటేష్, గణేష్, డీఎస్.సుభాష్ కృష్ణ, రాంబాబు, శ్రీనివాస్, మల్లేష్, ఉపేందర్, భూషణ్, దయాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ


కార్యక్రమంలోశ్రీనివాస వ్రతధర్ జీయర్‌స్వామి తదితరులు

అబిడ్స్: వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తులసి మొక్కలను పంపిణీ చేశారు. సీతారామ్‌బాగ్ మఠ్ ఆధ్యాత్మిక గురువు శ్రీనివాస వ్రతధర్ జీయర్‌స్వామి ముఖ్యఅతిథిగా హాజరై 750 తులసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హిందూ సమాజ అభివృద్ధికి, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరకుమార్ గుప్తా, బొశెట్టి హరినాథ్, బాలకృష్ణ, పురం శ్రీనివాస్, ఉప్పల వినీత్‌కుమార్, మళయాల కృష్ణ, తాటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలి


వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ధన్‌రాజ్

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మనిషి ఆధ్యాత్మిక భావాలవైపు మళ్లినప్పుడే జీవితం సుఖ సంతోషాలతో, ఉల్లాసంగా ఉంటుందన్నారు. గురువారం గోషామహల్‌లో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకుడు ధన్‌రాజ్ నిర్వహించిన అమ్మలక ఏకాదశి పూజా వేడుకల్లో తలసాని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తలసానిని ధన్‌రాజ్ ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర


సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

చార్మినార్: దేశ ఆర్థిక అభివృద్ధిలో మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఉస్మానియా విశ్వ విద్యాలయం దూర విద్యా విభాగం సంచాలకులు ఆచార్య జి.వి.రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో సామాజిక 'సమ్మిళిత అభివృద్ధిలో మహిళల పాత్ర' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య జి.వి.రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతలు తొలగిపోయినపుడే ఆదర్శ సమాజం ఏర్పడుతుందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న వ్యవసాయ విశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యులు డా.విజయ ఖాదర్ మాట్లాడుతూ..దేశంలో గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకూ విధానపరమైన నిర్ణయాలు తీసుకునే కీలక సంఘాల్లో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. ప్రముఖ శాస్త్రవేత్త కైసర్ జమీల్ మాట్లాడుతూ.. మహిళా ప్రగతితోనే సామాజిక సమ్మిళిత ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యులు డా.పి.పి.రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు కేవలం 30 శాతం రిజర్వేషన్ మాత్రమే సరిపోద్దన్నారు. అనంతరం పరిశోధనా పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఆచార్య జి.వి.రెడ్డి ఆవిష్కరించారు. కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్.యం అనురాధ, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్ల, సదస్సు సంచాలకులు డా.వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఆసుపత్రికి అవసరమైన నీటిని అందిస్తాం


గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి నీటి కొరత లేకుండా చూస్తామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లాతో కలిసి కొత్తగా వేసిన బోరుతో పాటు పాత బోరును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత బోరుకు మళ్లీ రీబోరింగ్ చేసి అందులో కూడా నీరు వచ్చే వరకు డ్రిల్లింగ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల సేవలు అందించాలన్నారు. జలమండలి వారికి గోల్కొండ ఏరియా ఆసుపత్రికి అవసరమైన నీటి ట్యాంకర్లను పంపాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఓ శ్రీనివాస్‌రావు, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అమీరుద్దీన్ తదితరులున్నారు.

పారిశ్రామిక రంగానికి సాంకేతిక నిపుణులను అందించాలి


ఏలూరి శ్రీనివాసరావును సన్మానిస్తున్న టీజీఓస్ నాయకులు

విజయనగర్‌కాలనీ: పారిశ్రామిక రంగానికి ఐటీఐల ద్వారా సాంకేతిక నిపుణులను అందించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ టీజీఓస్ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులు త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు శిక్షణాధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉపాధి శిక్షణశాఖ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఎక్కువ చదువులేని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఐటీఐలలోని వృత్తి విద్య కోర్సులలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీతారాములు, వెంకటేశ్వర్‌రావు, ఎం.మోహన్‌నారాయణ, జేడి.నగేష్, ఆర్‌డీడీలు రాజా, ప్యారం నర్సయ్య, మల్లేపల్లి, సనత్‌నగర్, ఖైరతాబాద్ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు పుప్పాల జ్యోతిరాణి, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ జయశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు

గౌలిపురా: ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సీడీపీఓ జయశ్రీ సూచించారు. సుల్తాన్‌షాహీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆకుకూరలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ జయశ్రీ మాట్లాడుతూ..పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలకు చిరు ధాన్యాలు వాడటంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ అంగన్‌వాడీ టీచర్లు మంజుల, డి.నిర్మల, గీత శ్రీవాత్సవ్, ఏఎన్ఎం ఆర్.అనిత, ఆశా వర్కర్లు జి.లత, కె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన


మాట్లాడుతున్న రఘుకుమార్

లంగర్‌హౌస్: ఆటోవాలాలు క్రమశిక్షణతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ గురువారం రాత్రి లంగర్‌హౌస్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ మాట్లాడుతూ..ప్రతి ఆటోకు త్వరలో పోలీస్‌స్టేషన్‌లో ధ్రువీకరణ నెంబర్ ఇస్తామన్నారు. ఆటో స్టాండ్లలో వాహనాలు ఇష్టానుసారంగా నిలుపడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా బాపూనగర్ బస్‌స్టాప్, లంగర్‌హౌస్ చౌరస్తాలలో పరిస్థితి ఘోరంగా ఉందన్నారు. ఇకపై ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజు, రాఘవేందర్, సత్యనరేందర్ పాల్గొన్నారు.


గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మామిడి భీమ్‌రెడ్డి తదితరులు

గవర్నర్‌కు శుభాకాంక్షలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీకి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ వైస్ చైర్మన్ విజయ్‌కుమారి, మేనేజింగ్ కమిటీ సభ్యులు వీరమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్: తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన సీ.పీ రాధాకృష్ణన్‌ను జాంబాగ్ కార్పొరేటర్ కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛాని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బబ్లూ సింగ్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ అయిన బల్దియా డివిజన్‌లకు ఉప ఎన్నికలు ఎప్పుడో?

గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గంలోని రెండు డివిజన్‌లకు కార్పొరేటర్లు లేరు. గత సంవత్సరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ హఠాన్మరణంతో గుడిమల్కాపూర్ డివిజన్ ఖాళీగా ఉంది. గత సంతవ్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్‌గా ఉన్న మహ్మద్ మాజీద్ హుస్సేన్ నాంపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆ స్థానం కూడా ఖాళీ అయింది. నాంపల్లి నియోజకవర్గంలో రెండు డివిజన్‌లకు ప్రజాప్రతినిధి లేన్నట్లయ్యింది. గుడిమల్కాపూర్ డివిజన్‌లో మాత్రం కార్పొరేటర్ లేనందు వల్ల స్థానిక సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినా కార్పొరేటర్ స్థానాలకు ఉప ఎన్నికలు ఎప్పుడు అనే విషయం ఇంకా ఎవరికి తెలియలేదు. ఏదేమైనా ఈ రెండు డివిజన్‌లకు తొందరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.